


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

శనివారం | 08 | ఆగస్టు | 2026 | పేజీలు: 08


# 10న సాగర్‌కు సీఎం రేవంత్

### వరుణ యాగంకు పక్కా ఏర్పాట్లు

### విజయ విహార్ వద్ద వరుణ యాగం

### కలెక్టర్ చంద్ర శేఖర్



**హాలియా,అక్షిత ప్రతినిధి:** ఈ నెల 10న నాగార్జునసాగర్ సమీపంలోని విజయ విహార్ వద్ద నిర్వహించనున్న వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హాజరుకానున్నారన్న ప్రాథమిక సమాచారం మేరకు ఏర్పాట్ల విషయమై నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ శుక్రవారం నాగర్జున సాగర్ సమీపంలోని విజయ విహార్ ను సందర్శించారు. వరుణ యాగం నిర్వహించే యాగస్థలి, ప్రవచన శాల, యాగ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై దేవాదాయ, రెవెన్యూ, పోలీసు, ఇతర సంబంధిత శాఖల ..మిగతా 2లో

# ప్రజల దరికి ప్రగతి ఫలాలు

### ప్రజలకు మెరుగైన వైద్య, విద్య, తాగునీరు, సంక్షేమ సేవలు అందించడమే లక్ష్యం

### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలి

### రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ




**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలతో పాటు విద్య, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమం తదితర రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి, వాటి ఫలాలు ..మిగతా 2లో



# "బెల్ట్" కు చెక్ ఊరంతా ప్రతిన

### సభ తీర్మానం అతిక్రమిస్తే లక్ష !

### లంక మల్లారం గ్రామసభలో "బెల్ట్ షాపులపై నిషేధం"

### 'మన ఆరోగ్యం-మన కుటుంబం' నినాదంతో బెల్ట్ షాపుల నిషేధం

**భద్రాద్రి కొత్తగూడెం / అక్షిత బ్యూరో :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లంక మల్లారం గ్రామపంచాయతీ బెల్ట్ షాపుల నిర్మూలన దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది నవంబర్‌లో గ్రామంలో జరిగిన కల్తీ సారా విషాద ఘటనను దృష్టిలో ఉంచుకుని, బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధిస్తూ గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై రూ.1 లక్ష జరిమానా విధించాలని కూడా నిర్ణయించింది.గ్రామ సర్పంచ్ పూనెం రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఈ తీర్మానానికి గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. "మన ఆరోగ్యం , మన కుటుంబం , మన భద్రత" అనే నినాదంతో గ్రామంలో మద్యం వ్యసనాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

**కల్తీ సారా ఘటనే నిర్ణయానికి కారణం**

గత సంవత్సరం నవంబర్‌లో లంక మల్లారం గ్రామంలో కల్తీ సారా సేవించి ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. ఆ సంఘటన తర్వాత కూడా గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని గ్రామస్థులు గ్రామసభలో ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి విషాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. రూ.1 లక్ష జరిమానా.. పూర్తి బాధ్యత యాజమాన్యానిదే గ్రామసభ తీర్మానం ప్రకారం బెల్ట్ షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన వారిపై ..మిగతా 2లో

# తొలి విద్యాభ్యాసం భవితకు పునాది

### ఆటపాటలతో కూడిన బోధన అత్యవస్యం

### జిల్లా కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** చిన్నారులకు ఆటా, పాటలతో కూడిన బోధన అవసరమని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. ప్రీ-ప్రైమరీ సెక్షన్లు నిర్వహిస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆసిఫాబాద్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ..మిగతా 2లో

# విజ్ఞాన దేశంగా భారత్ అడుగులు



### విద్య, వైద్యం బలోపేతంతోనే వికసిత్ భారత్ లక్ష్యాలు సాధ్యం

2

### రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

### కన్హా శాంతి వనంలో 'విజన్ ఇండియా-2047' జాతీయ సదస్సులో మంత్రి ప్రసంగం

## 10న సాగర్‌కు సీఎం రేవంత్

**మొదటి పేజీ తరువాయి...**

అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరు కానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యాగశాల ఏర్పాటు చేసే ప్రదేశం, భారీకేడింగ్ , పగోడాల ఏర్పాటు, ప్రవచనశాల, టెంట్లు, ఎల్ఈడిలు,పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు వివిధ ప్రాంతాల నుండి యాగం నిర్వహించేందుకు వచ్చే ఋత్వికులు, అర్చకులకు వసతి సౌకర్యాల వంటి ఏర్పాట్లన్నీ చేయాలని చెప్పారు. అంతేకాక అన్ని చోట్లా భారీకేడింగ్ ఏర్పాటు చేయాలని, ప్రవచనాలు వినేందుకు బయట నుండి వచ్చే సాధారణ ప్రజలకు, యాగానికి హాజరయ్యే ప్రముఖులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి, శాసన సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు అధిరులు హాజరుకానున్న దృష్ట్యా యాగశాల వద్ద యాగాన్ని తిలకించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లతో పాటు, బందోబస్తు, ఇతర ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు.విజయవిహార్ మొత్తం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోటేశ్వరరావును ఆదేశించారు. అలాగే అవసరమైన చోట పగోడాల ఏర్పాటుతోపాటు, తాగునీరు, మూత్రశాలలు, ముందు రోజు నుండి యాగానికి వచ్చే ఋత్వికులు ,అర్చకులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్ శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, వరుణ యాగం నిర్వహించే స్థలం మొత్తం ప్లాన్ తో సహా సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

అదనపు ఎస్పి రమేష్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, యాదాద్రి దేవాలయ డిప్యూటీ ఈవో డి. భాస్కర్ జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కే. భాస్కర్, డీఎస్పీ రవి, ఆర్ఐ శ్రీనివాస రెడ్డి, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## తొలి విద్యాభ్యాసం భవితకు పునాది

**మొదటి పేజీ తరువాయి...**

శుక్రవారం నాడు ప్రారంభమైన ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హారిత హాజరై మాట్లాడారు. ప్రి ప్రైమరి అభ్యాసం చిన్నారుల తొలి విద్యాభ్యాస దశ అని అది వారి భవిష్యత్ విద్యకు పునాది వంటిదని అన్నారు. ప్రీ-ప్రైమరీ దశలో పిల్లలపై చదువు ఒత్తిడి లేకుండా, ఆటలు, పాటలు, కథలు, సంభాషణలు, చిత్రలేఖనం, వివిధ కార్యకలాపాల ద్వారా నేర్చుకునే అవకాశాలను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ మహేశ్వర్ , రిసోర్స్ పర్సన్లు శంకర్, ఝాన్సీ,వెంకటేష్ మరియు ప్రీ-ప్రైమరీ సెక్షన్లు నిర్వహిస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## "బెల్ట్"కు చెక్ ఊరంతా ప్రతిన



**మొదటి పేజీ తరువాయి...**

రూ.1 లక్ష జరిమానా విధించనున్నారు. అలాగే మద్యం విక్రయాల కారణంగా గ్రామంలో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే సంబంధిత బెల్ట్ షాపు నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధితో పాటు సామాజిక భద్రతకు ప్రాధాన్యం జీపీడీపీ 2026, 27 గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభలో విద్య, వైద్యం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పేదరిక నిర్మూలన, మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించారు. అయితే గ్రామ ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బెల్ట్ షాపుల నిషేధానికే అత్యధిక ప్రాధాన్యం లభించింది. గ్రామాన్ని మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి గ్రామస్థుడు సహకరించాలని, గ్రామసభ తీర్మానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# విజ్ఞాన దేశంగా భారత్ అడుగులు

**విద్య, వైద్యం బలోపేతంతోనే వికసిత్ భారత్ లక్ష్యాలు సాధ్యం**

**రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**కన్హా శాంతి వనంలో 'విజన్ ఇండియా-2047' జాతీయ సదస్సులో మంత్రి ప్రసంగం**







**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన, స్వావలంబన కలిగిన విజ్ఞాన దేశంగా తీర్చిదిద్దడంలో యువత, శాస్త్ర విజ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణలే ప్రధాన చోదక శక్తులని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

పాలమూరు విశ్వ విద్యాలయం, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా కన్హా శాంతి వనంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు "విజన్ ఇండియా--2047: ఇంటిగ్రేటింగ్ సైన్స్, ఇన్నోవేషన్ అండ్ యూత్ ఎంపవర్మెంట్" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ప్రసంగించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, యువశక్తి సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధనం, అంతరిక్ష సాంకేతికత, స్టార్టప్‌లు వంటి రంగాలే భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా నిలుస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో సమతుల్య, సుస్థిర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్యూర్, క్యూర్, రేర్ , మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధి అనే నాలుగు అభివృద్ధి స్తంభాల ఆధారంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. ఆర్థికాభివృద్ధి మాత్రమే కాకుండా సమాజంలో ఆలోచనా విధానంలోనూ మార్పు రావాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ భారతం ఇప్పటికీ అప్పుల ఊబిలో ఉండటం ఆందోళనకరమని, ప్రజలు కార్పొరేట్ విద్య, వైద్యం, ఆడంబరాలకు అధికంగా ఖర్చు చేయడం వల్ల అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్య, వైద్య సేవలను మరింత నాణ్యంగా, బలోపేతంగా తీర్చిదిద్దడం ద్వారానే వికసిత్ భారత్--2047, రైజింగ్ తెలంగాణ--2047 లక్ష్యాలను సాధించవచ్చని స్పష్టం చేశారు. సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వం త్వరలో 'ప్రభాత భేరి' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. విశ్వ విద్యాలయాలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తల తయారీ, సమాజాభివృద్ధికి కేంద్రాలుగా ఎదగాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం--విశ్వవిద్యాలయాలు--పరిశ్రమల మధ్య సమన్వయం బలోపేతమైతే యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన అవకాశాలు, ఉపాధి మరింత విస్తరిస్తాయని తెలిపారు.

ఈ జాతీయ సదస్సులో జరిగే మేధోమథనం, చర్చలు దేశం, రాష్ట్రం నిర్దేశించుకున్న 2047 అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఆచరణాత్మక సూచనలను అందిస్తాయని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజల దరికి ప్రగతి ఫలాలు

**మొదటి పేజీ తరువాయి...**

ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యం, విద్య, సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖలకు సంబంధించి జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వాటి పురోగతి, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, తదితర అంశాలపై శాఖల వారీగా మంత్రి సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి చేపడుతున్న చర్యలపై మంత్రి సమీక్షించారు. జోగిపేట ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సిన డ్యూటీ డాక్టర్ స్థానంలో మరో నకిలీ వ్యక్తి డాక్టర్‌గా విధులు నిర్వహించిన ఘటనపై మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రుల్లో వైద్యుల హాజరు, విధుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని డిసి హెచ్ ఎస్ , ఆసుపత్రి సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. కంకోల్, సింగితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని, బర్దిపూర్, సుల్తాన్‌పూర్, నేరడిగుంట పీహెచ్ సి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధుల నమోదైన కేసుల వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జహీరాబాద్ ఎం సి హెచ్ లనుత్వరలో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. సంగారెడ్డి జి జి హెచ్ లో అవసరమైన ఎక్విప్మెంట్, మందులు అందుబాటులో ఉండాలని, నిరంతరం పర్యవేక్షించాలని జి జి హెచ్ సూపరింటెండెంట్ కు సూచించారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మంత్రి ఆదేశించారు. పి హెచ్ సి లు,అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కె జి బి విలు,మోడల్ స్కూళ్లు, జడ్ పిహెచ్ ఎస్ లలో త్రాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్ల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన పనులను పూర్తి చేయాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి విద్యార్థులు ఆహ్లాద వాతావరణంలో చదువుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. బోరంచ, భూసారెడ్డిపల్లి ఇంటెక్ వెల్‌ల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాపై కూడా మంత్రి వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో ప్రస్తుత తాగునీటి సరఫరా పరిస్థితిని వాస్తవికంగా అంచనా వేసి, జిల్లాలో సరిపడు వర్షాలు పడని పక్షంలో రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దాం

### మేయర్ కోలగాని శ్రీనివాస్

### అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** మన సంప్రదాయానికి ప్రతీక అయిన చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దామని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారికి సంక్షేమ పథకాలు అందించి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పచ్చునూరు చేనేత క్లస్టర్ తయారు చేసిన చీరను ఆవిష్కరించారు. ఆడిటోరియం వద్ద టెస్కో కరీంనగర్ డివిజన్ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాలతో కూడిన ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేశారు.అనంతరం చేనేత ప్రతిజ్ఞ చేశారు.అంతకుముందు గీతా భావం చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు చేనేత సహకార సంఘాల అధ్యక్షులు పాలకవర్గ సభ్యులు, కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, మాజీ మేయర్ రవీందర్ సింగ్, కార్పొరేటర్ వాసాల రమేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టనున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకితో కలిసి గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ లో టెంట్ల ఏర్పాటు, వీఐపీ సీటింగ్, ప్రధాన వేదిక ఏర్పాటు, అధికారులు, ప్రజాప్రతినిధుల సీటింగ్ ఏర్పాటు, పరేడ్ నిర్వహణ విధానం, కార్యక్రమాల ప్రారంభ క్రమం, శకటాల ప్రదర్శన, వివిధ శాఖల స్టాళ్ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్, అవసరమైన చోట మార్పులు చేసి ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వర్షం కురిసే అవకాశం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కూడిన ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ నవీన్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాయపోల్ మండల కేంద్రంలోనే తహసిల్దార్ కార్యాలయం నిర్మించాలి

### గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం..

### ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామస్థుల విజ్ఞప్తి



**దుబ్బాక అక్షిత ప్రతినిధి:** రాయపోల్ మండల కేంద్రంలోనే నూతన తహసిల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కేంద్రం నుంచి తహసిల్దార్ కార్యాలయాన్ని ఇతర ప్రాంతానికి తరలించడాన్ని గ్రామస్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు తహసిల్దార్ కార్యాలయ నిర్మాణం మండల కేంద్రంలోనే చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అనువైన స్థలాలు అందుబాటులో ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. సర్వే నంబర్ 720 లో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని, అక్కడే నూతన తహసిల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మించాలని పేర్కొన్నారు.స్థల పరిశీలన విషయంలో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించి, మండల కేంద్రంలోనే తహసిల్దార్ కార్యాలయ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు. కార్యాలయాన్ని మండల కేంద్రం వెలుపలికి తరలించే ప్రతిపాదనను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని రాయపోల్ మండల కేంద్రంలోనే నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ప్రజల సౌకర్యం, మండల కేంద్రం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అధికారులు సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని చేనేత సహకార సంఘము భవనము వద్ద శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సంఘ అధ్యక్షులు బడుగు మోహన్ బాబు సహకార పతక ఆవిష్కరణ గావించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలను ధరించి నేతన్నను బతికించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బడుగు మోహన్ బాబు,ఉపాధ్యక్షులు గోశిక శ్రీకాంత్ , కార్యదర్శి కాటబత్తిని భీమయ్య , కోశాధికారి బడుగు సావిత్రి, కార్యవర్గ సభ్యులు, బడుగు లక్ష్మయ్య,కొండా లక్ష్మణ్ బాపూజీ ట్రస్ట్ చైర్మన్, జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు గుర్రం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మపాలు ప్రకృతి ప్రసాదించిన అమృతం

### 16వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాసు



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** ఆగస్టు 1 నుండి 7 వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం 16వ వార్డు పరిధిలోని అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలు,బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 16వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మదాసు హాజరై తల్లిపాలు నవజాత శిశువులకు ప్రకృతి ప్రసాదించిన అమృతం లాంటివని పేర్కొన్నారు. పుట్టిన గంటలోపే బిడ్డకు అందించే ముర్రుపాలు శిశువుకి టీకాగా పనిచేసి భవిష్యత్తులో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు, సిబ్బంది,అంగన్వాడి పరిధిలోని గర్భిణీలు,బాలింతలు, చిన్నారుల తల్లులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ చే జాతీయ చేనేత దినోత్సవం



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని, చేనేత ఉద్యమానికి విశిష్ట సేవలందించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి చౌటుప్పల్ క్లాత్ అండ్ రెడిమేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేనేత వృత్తి అభివృద్ధికి, చేనేత కార్మికుల సంక్షేమానికి బాపూజీ చేసిన విశిష్ట సేవలను గుర్తు చేసుకొన్నారు.

నేటి యువత చేనేత వస్త్రాలను ఎక్కువగా వినియోగించడం ద్వారా చేనేత కార్మికులకు అండగా నిలవాలని, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత సంక్షేమ పథకాలు మరింత మంది నేతన్నలకు చేరేలా కృషి చేయాలని, చేనేత రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి శ్యాం ప్రసాద్, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, కోశాధికారి మసరం యాదగిరి,గౌరవ సలహాదారులు పిల్లల మరి అశోక్, జిల్లా బిక్షం, సభ్యులు పున్న రామకృష్ణ, గోశిక పాండు, బాష్పాల జగదీష్, లోక విష్ణు, గంజి రవి,ముత్యాలు,భారత రవితేజ,దొంత మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రినిటీ పాఠశాలలో ఘనంగా బోనాల జాతర



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ పట్టణం లోని ట్రినిటీ పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో శుక్రవారం బోనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు బోనాలు నెత్తినెత్తుకొని, పోతురాజు వేషధారణ లో పాల్గొని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ట్రినిటీ హై స్కూల్ ప్రిన్సిపాల్ కమ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల హాజరై మాట్లాడుతూ... ఆషాఢమాసం తెలంగాణ ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన మాసమని అన్నారు. ఈ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని, బోనాలు అమ్మవారికి కృతజ్ఞతగా సమర్పించే నైవేద్యం అని "బోనం అంటే భోజనం" అని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కేవీబీ కృష్ణారావు, సమన్వయకర్తలు భార్గవి, స్వరూప,పూజా రెడ్డి, ఉపాధ్యాయులు కరుణ,మౌనిక, జ్యోతి,అరుణ, స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

## నారాయణ ఈ-టెక్నో స్కూల్‌లో నాసా థీమ్ పెయింటింగ్ పోటీలు



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మం నగరం మమతా రోడ్ లో గల నారాయణ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో స్కూల్ స్థాయి నాసా థీమ్ పెయింటింగ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అంతరిక్షం గ్రహాలు రాకెట్లు వ్యోమగాములు భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలు వంటి అంశాలపై ఆకర్షణీయమైన చిత్రాలను గీసి తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల చిత్రాలను సృజనాత్మకత అంశ ప్రతిబింబం రంగుల వినియోగం ఆధారంగా ఉపాధ్యాయులు మూల్యాంకనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం ఊహాశక్తి కళాత్మక నైపుణ్యాలను పెంపొంది స్తాయని తెలిపారు. విజేతలను అభినందించి బహుమతులు అందించారు. పాల్గొన్న ప్రతి విద్యార్థిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేసింది. నారాయణ ఈ-టెక్నో స్కూల్ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని పేర్కొంది.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** నగరపాలక సంస్థ కరీంనగర్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 2వ డివిజన్ చంద్రపురి కాలనీలో రూ.28 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధినేని మునీందర్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# బోడగుట్టను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతాం...

### బోడగుట్టలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే నాయిని...



**కాజీపేట, అక్షిత ప్రతినిధి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట 47వ డివిజన్ బోడగుట్ట ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. పూర్తి గ్రామీణ వాతావరణం కలిగిన బోడగుట్టకు పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధికి కొత్త ఒరవడి ప్రారంభమైందని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిని ప్రథమ



ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రోజున 47వ డివిజన్ బోడగుట్టలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరిచి బోడగుట్టను ఆదర్శవంతమైన ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై వెంటనే స్పందించిన ఆయన, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంత వరకు పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కాలంలో చేపట్టే రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపడితే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధికారులు పాల్గొన్నారు.

## పరిశుభ్ర బోగారం లక్ష్యంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం

### నాలుగు రకాల చెత్తబుట్టల వినియోగంపై ప్రజలకు అవగాహన

### ప్రతి ఇంటా చెత్త విభజనతో స్వచ్ఛ గ్రామ నిర్మాణానికి సర్పంచ్ కునూరు సాయి కుమార్ గౌడ్ పిలుపు




**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామంలో స్వచ్ఛ గ్రామ నిర్మాణమే లక్ష్యంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నాలుగు రకాల చెత్తబుట్టల వినియోగం, చెత్త విభజనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ మాట్లాడుతూ "మన గ్రామం--మన బాధ్యత" అనే భావనతో ప్రతి కుటుంబం చెత్తను తడి, పొడి తదితర వ్యర్థాలుగా వేరు చేసి, వాటిని ఆయా చెత్తబుట్టల్లోనే వేయాలని సూచించారు. చెత్తను మూలస్థాయిలోనే శాస్త్రీయంగా విభజించడం ద్వారా గ్రామంలో పరిశుభ్రతను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలతో దోమలు, ఈగల వ్యాప్తిని నియంత్రించడంతో పాటు అంటువ్యాధుల నివారణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని, బోగారం గ్రామాన్ని ఆదర్శ స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైకాని ఉమా మహేష్ యాదవ్, వార్డు సభ్యులు నేరటి మానస సురేష్ యాదవ్, మేడి ఆంజనేయులు, కనుక మల్లేష్, చిరగోని శిల్పా, నవీన్ యాదవ్, వనం అండాలు, యాదగిరి, గ్రామపంచాయతీ కార్యదర్శి ఏ. సుధా, సంఘబంధం అధ్యక్షురాలు పబ్బు జ్యోతి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గాదే హేమలత, భోగ సంధ్యతో పాటు గ్రామ పెద్దలు కూనూరు మహేష్ గౌడ్, బైకాని మహేష్ యాదవ్, మేడి కృష్ణ, మేడి ముఖేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల కళానైపుణ్యం అమోఘం

### నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

### బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని 39వ డివిజన్‌లోని చేనేత సహకార సంఘం కార్యాలయం వద్ద జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చేనేత మగ్గంపై స్వయంగా నేయడం ద్వారా మగ్గం పనితీరును తెలుసుకుని, చేనేత కార్మికుల అద్భుతమైన కళానైపుణ్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేనేత కార్మికుల ప్రతిభను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయడానికి, చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు విశేష కృషి చేశారని తెలిపారు. ఆ కృషిలో భాగంగానే 2015 ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్రాల బహిష్కరణ, స్వదేశీ ఉద్యమంలో చేనేత కార్మికులు అందించిన సేవలు చారిత్రాత్మకమైనవని కొనియాడారు. చేనేత రంగం భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా చేనేత సహకార సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లు, సభ్యులను ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్, తెళ్ళ లక్ష్మి రమేష్, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, బీజేపీ నాయకులు గుంజేటి మెతుకు సత్యం, శివన్న, అడిచర్ల రాజు, సతీష్, మునిందర్, చేనేత సహకార సంఘం డైరెక్టర్లు, సభ్యులు ,మహిళలు, చేనేత కార్మికులు, సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


# దొరల పాలన నుంచి తెలంగాణ వరకు...
# మారని కారోబార్ల దుస్థితి

**అర్ధశతాబ్దకాలంగా గ్రామాలకు సేవలే... కానీ ఉద్యోగ భద్రత, వేతనాలపై ప్రభుత్వాల నిర్లక్ష్యమంటున్న కారోబార్లు హోదా, రెగ్యులరైజేషన్, గౌరవప్రదమైన జీవనం కల్పించాలని విజ్ఞప్తి**



**నిర్మల్ అక్షిత బ్యూరో, ఆగస్టు 7:** గ్రామ పాలనలో దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు, గ్రామపంచాయతీకి వారధిగా పనిచేస్తున్న కారోబార్ల సమస్యలు నేటికీ పరిష్కారం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం పాలనలో "మాలి పటేల్"గా పిలువబడిన ఈ వ్యవస్థ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో "కారోబారి" హోదాగా కొనసాగింది. గ్రామపంచాయతీ అధికారులకు సహాయకులుగా నియమితులైన వీరు, గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు, రెవెన్యూ, పంచాయతీ పరిపాలనలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ వస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినప్పటికీ, నేటికీ ఉద్యోగ భద్రత, హోదా, వేతనాల విషయంలో ఎలాంటి పురోగతి లేదని నిర్మల్ జిల్లా కుబీర్ మండల కారోబార్ల సంఘం అధ్యక్షుడు పీ. బాబు ఆవేదన వ్యక్తం చేశారు.



1974లో కారోబారిగా నియమితులైన ఆయనకు అప్పట్లో నెలకు కేవలం రూ.35 వేతనం మాత్రమే ఉండేదని తెలిపారు. అనంతరం రూ.75, రూ.650, రూ.5,500 వరకు పెరిగిన వేతనం, తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రస్తుతం రూ.9,500కు చేరినప్పటికీ పెరిగిన జీవన వ్యయానికి అది ఏమాత్రం సరిపోవడం లేదన్నారు.

ఇదే సమయంలో తమతో పాటు గ్రామస్థాయిలో పనిచేసిన రెవెన్యూ శాఖ సిబ్బందికి చట్ట సవరణల ద్వారా ఉద్యోగ భద్రత కల్పించి, ఇతర శాఖల్లో రెగ్యులరైజ్ చేసినప్పటికీ, కారోబార్లను మాత్రం ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. మాలిగాం గ్రామపంచాయతీకి చెందిన కారోబారి ఎం. గంగాధర్ మాట్లాడుతూ, తాను 1992లో విధుల్లో చేరానని, అప్పటి నుంచి ఎనిమిది మంది సర్పంచ్‌లు మారినా, ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా తమ హోదాలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలులో నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ తమకు కనీస ఉద్యోగ భద్రత కూడా లేకపోవడం బాధాకరమన్నారు.

దశాబ్దాలుగా సేవలందించిన అనేక మంది కారోబార్లు పదవీ విరమణ ప్రయోజనాలు కూడా పొందకుండా మరణించారని, ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో చాలామంది వృద్ధాప్యానికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తులం బంగారం కొన్ని వందల రూపాయలే ఉండేదని, ప్రస్తుతం లక్షల్లోకి చేరిన నేపథ్యంలో పెరిగిన ధరలకు అనుగుణంగా తమ వేతనాలు లేకపోవడంతో కుటుంబ పోషణ కూడా భారంగా మారిందన్నారు.

కారోబార్ల సమస్యల పరిష్కారం కోసం అనేకసార్లు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అవి ఫైళ్లకే పరిమితమవుతున్నాయని పేర్కొన్నారు. తమకు ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్, గౌరవప్రదమైన వేతనం, సంక్షేమ పథకాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. "గ్రామాల కోసం జీవితాంతం సేవ చేశాం... మా సమస్యలు ఎప్పుడు తీరుస్తారు?" అంటూ కారోబార్లు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

# ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యార్థుల సమస్యలే

**వెంటనే పీఆర్సీ విడదల చేయాలి**

**సమస్యలు పరిష్కరించకపోతే పోరాటానికి సిద్ధం**

**ఖమ్మం జిల్లా యుఎస్పీసీ ఉపాధ్యాయ పోరాట సంఘాల కమిటీ స్టీరింగ్ కమిటీ సభ్యులు షేక్ రంజాన్ అజ్మీరా భావసాన్**



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా ఉపాధ్య సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిన్న పాఠశాలలో నల్ల రిబ్బన్ లు ధరించి నిరసన వ్యక్తం చేయాలని మధ్యాహ్నం నిరసన ప్రదర్శన చేయాలని పిఆర్సి ఇచ్చేవరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని యు ఎస్ పి సి ఇచ్చినటువంటి దశల వారి పోరాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా యు ఎస్ పి సి స్టీరింగ్ కమిటీ సభ్యులు తెలియజేసినారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ చేపట్టిన దశల వారి పోరాట కార్యక్రమాలు విజయవంతం కావాలని వాళ్ళ డిమాండ్ ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఖమ్మం జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షులు కె మార్క్ సంఘీభావం తెలియజేసినారు ఉపాధ్యాయుల సమస్యలన్నీ విద్యారంగానికి సంబంధించినవేనని ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సంతృప్తిగా పనిచేయాలంటే సమస్యలన్నీ పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ముఖ్యమంత్రి చెప్పినట్లు విద్యారంగ సమస్యలపై ఐక్యంగా కొట్లాడాలని టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితుల పట్ల అవగాహన లేకుండా తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడే ప్రమాదం ఏర్పడిందన్నారు. హేతుబద్ధీకరణ జీవో 25 ను హేతుబద్ధంగా సవరించాలని డిమాండ్ చేశారు. సర్వీసు నిబంధనల సంక్షోభం పరిష్కారానికి చొరవ చూపాలని డిఈఓ డిప్యూటీ ఇఒ ఎంఈఒ పోస్టులను మంజూరు చేయాలని వాటిని రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని ఆగస్టు 15 లోగా బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పిఆర్సీ అమలు గడువు ముగిసి మూడేళ్ళు అవుతున్నా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. ఆరు వాయిదాల కరువుభత్యం విడుదల చేయాలని పెండింగ్ బిల్లుల విడుదలలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకాన్ని అన్ని హాస్పిటల్స్ లో సమర్థవంతంగా అమలు చేయటానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్పొరేట్ పాఠశాల ప్రారంభోత్సవాలకు హాజరై ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతి సంవత్సరం 1,80,000, ఖర్చు పెడుతున్నామని మరొక మారు ప్రతి సంవత్సరం 80,000 రూపాయల ఖర్చు పెడుతున్నామని వివిధ వేదికలలో వివిధ రకాలుగా తెలపడం శోచనీయమన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7% లోపు బడ్జెట్ కేటాయించడం వలన ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని అనడం విడ్డూరం అని అన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడే విధానం ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు ఊతం ఇచ్చే విధంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాదినేని నరసింహారావు కెవిఎల్ నరసింహారావు గారు కట్టారు శ్రీనివాసరావు యన్ శ్రీనివాసరావు కె.రమేష్ గారు జి వెంకటేశ్వరరావు చింతల రాంబాబు సిహెచ్ రాజేశ్వరి భోజడ్ల మాధవి సూరంపల్లి అంజనా దేవి వనమా శైలజ కె భాగ్యలక్ష్మి లక్కినేని శ్రీలత లలిత నిరసన ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సిపిఐ పాదయాత్ర

**ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం తగదు**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ డిమాండ్**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** సిపిఐ పాదయాత్రలో భాగంగా రెండో రోజు చంద్రకల్, ముష్టిపల్లి పెరుమళ్ళపల్లి, మరికల్, పెద్ద కార్పాముల మీదుగా దేదినేని పల్లి కి చేరుకుంది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం లేకుండా అసలైన లబ్ధిదారులను గుర్తించి ఇల్లు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే కాకుండా నిరుపేద ప్రజలందరికీ ఇండ్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు లేకపోతే ప్రజలను సమీకరించి ఎంపీడీవో, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన తెలియజేశారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన అన్ని రకాల హామీలను నెరవేర్చాలని ఈ సందర్భంగా ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీరు నరసింహ, ఇందిరమ్మ, జిల్లా కౌన్సిల్ సభ్యులు తుమ్మల శివుడు, బండి లక్ష్మపతి, బిజ్జా శ్రీనివాసులు, కిరణ్ కుమార్, లక్ష్మీనారాయణ, పుట్ట కుర్మయ్య, గాలెన్న, పటేల్ రాముడు, సలేశ్వరం, రామకృష్ణ, బాల పీరు, తదితరులు పాల్గొన్నారు

## లిక్విట్ ఇండియా స్ఫూర్తితో జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి**



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సిపిఎం పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి వర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సత్తుపల్లి రావి వీర వెంకయ్య భవన్ చలమాల విఠల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి పిలుపునిచ్చారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని చట్టబద్ధమైన హక్కుగా కాకుండా ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడే సంక్షేమ పథకంగా మార్చే ప్రయత్నం చేస్తోందని ఆమె విమర్శించారు.దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, సంక్షేమ పథకాలకు నిధుల కోత, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ జైలు భరో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు, మేధావులు ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమానికి మద్దతుగా నిలవాలని మాచర్ల భారతి కోరారు.ఈకార్యక్రమంలో సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు, మొరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు కోలికపోగు సర్వేశ్వరరావు, అయినాల రామలింగేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జునరావు, అరవపల్లి జగన్మోహన్ రావు, జాజిరి జ్యోతి, రావుల రాజబాబు, మల్లూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి తల్లి గుర్తించాలి

**గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామం లోని అంగన్వాడి కేంద్రలలో ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ప్రతి తల్లి శిశువుకు తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించాలని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయని అన్నారు. తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. తల్లులకు పోషక ఆహారం శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు.అనంతరం అక్షరాభ్యాసం,కార్య క్రమం నిర్వా హించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు అంతుల్ బేగం, సమంత, గ్రామపంచాయతీ సెక్రెటరీ రమాదేవి, వార్డు సభ్యులు వాజీద్, లట్టుపల్లి వసంత, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సమానత్వ సాధనకే రిజర్వేషన్లు



**వరంగల్, అక్షిత బ్యూరో:** వివిధ వర్గాల మధ్య అసమానతలను తొలగించి సామాజిక, విద్యా, ఆర్థికపరమైన సమానత్వ సాధనకే రిజర్వేషన్ల విధానాన్ని అమలు చేస్తున్నారని కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ తిరునాహరి శేషు అభిప్రాయపడినారు.

మండల్ డేని పురస్కరించుకొని విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శేషు మాట్లాడుతూ మండల్ కమీషన్ సిఫారసుల మేరకు 1990 ఆగస్టు 7న నాటి వి.పి.సింగ్ ప్రభుత్వం ఓబిసి లకి విద్యా ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లను ప్రకటించిందని తెలియజేశారు. మండల్ కమీషన్ సిఫారసుల మేరకు వీ.పీ.సింగ్ ప్రభుత్వం ఓబిసిలకి రిజర్వేషన్లు ప్రకటిస్తే ప్రతిభకి అన్యాయం జరుగుతుందని నాడు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారే నేడు ఈడబ్ల్యూఎస్ రూపంలో రిజర్వేషన్లు పొందుతున్నారు కాబట్టి దేశంలో అసమానతలు కొనసాగినంత కాలం రిజర్వేషన్లు కొనసాగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన విధంగానే బలహీన వర్గాలకు కూడా చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ ని కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా పట్టించుకోవటం లేదని విమర్శించారుజన జన్- జి ఉద్యమం పేరుతో రిజర్వేషన్ హఠావో ఆందోళన తో ముందుకు వస్తున్న వారు ముందుగా తమ రిజర్వేషన్లను వదులుకొని ఉద్యమం చేయాలని డిమాండ్ చేసినారు.కేంద్ర ప్రభుత్వాలు మండల్ కమీషన్, జస్టిస్ రోహిణి కమీషన్ సిఫారసులను అమలు చేయకుండా బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు.

# నైపుణ్య వారసత్వాన్ని కొనసాగించాలి

**చేనేత దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, కలెక్టర్ డాక్టర్ సత్య, శారద**




**వరంగల్, అక్షిత బ్యూరో:** జాతీయ చేనేత దినోత్సవంను పురస్కరిచుకొని, జాతీయ చేనేత దినోత్సవంను పద్మశాలి కమ్యూనిటీ హాల్, కొత్తవాడ, వరంగల్ లో నిర్వహించారు.. ఈ కార్యక్రమానికు ముఖ్య అతిధులగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్, వరంగల్ పాల్గొనటం జరిగినది. ఈ కార్యక్రమములో భాగంగా చేనేత నడకని కొత్తవాడ లోని, ఇందిరా గాంధీ విగ్రహం నుండి ప్రారంభించటం జరిగినది. తదనంతరం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్, వరంగల్ చేనేత అనుభవం, నైపుణ్యం కలిగిన చేనేత కార్మికులు సన్మానం చేశారు.



ఈ కార్యక్రమములో భాగంగా జిల్లా కలెక్టర్, వరంగల్, డా. సత్య శారదా, మాట్లాడుతూ ఇక్కడి చేనేత కార్మికులు ప్రస్తుత ఫాషన్ కి తగినట్లు వస్త్రోత్పత్తి చేసి అధిక ఆదాయం పొందాలని ఎమ్మెసెమ్మి ద్వార చేనేత కార్మికులు నమోదు చేసికొని ఎగుమతికి వీలైన ఉత్పత్తులు చెయ్యాలని ఇక్కడ వున్నా చేనేత కళాకారుల నైపుణ్య వారసత్వాన్ని కొనసాగించాలని, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించటం ప్రజలు చేనేత వస్త్రాలను వినియోగించేలా అవగాహనా కల్పించటం ద్వారా చేనేత రంగానికి మరింత ప్రోత్సాహము లభిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ చేనేత సంఘాలు చేనేత కార్మికులని దృష్టిలో పెట్టుకొని మార్కెట్ కు తగిన ఉత్పత్తులు తయారు చేసి సంఘాలు పరిపుష్టి అయ్యేలా కృషి చెయ్యాలని కోరియున్నారు.

ఈ కార్యక్రమములో వై. శ్రీకాంత్ రెడ్డి, సహాయ సంచాలకులు, చేనేత,జాలిశాఖ, వరంగల్ జెనరల్ మేనేజర్, ఇండస్ట్రీస్ వరంగల్ సుదీర్ కుమార్, పంతగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

**'హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాంలను సక్సెస్ చేయండి**

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ఆగస్టు 15న జరగబోయే 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని తలపెట్టిన హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం, 'తిరంగా యాత్ర' లను సక్సెస్ చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. బిజెపి తిమ్మాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా నగర్ లోని శ్రీ తపాలా లక్ష్మీనరసింహస్వామి దేవాలయ కళ్యాణ మండపంలో హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం సన్నాక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ తిరంగా యాత్ర నిర్వహణ కోసం బిజెపి శ్రేణులు సమాయత్తం కావాలని, దేశభక్తిని చాటేలా ఈ నెల 10 నుండి దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాములు ప్రారంభం అవుతాయని తెలిపారు. మండల పార్టీ ఆధ్వర్యంలో తిరంగా ప్రోగ్రామ్ లను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని విజయవంతం చేపట్టి, ప్రజలు విద్యార్థులు ఇట్టి కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు.



అలాగే ఆగస్టు 12 నుంచి 14 వరకు మహాపురుషుల, స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలు శుద్ధి చేసి , స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు అన్ని మండలాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే సామాజిక ఉద్యమంగా మార్చాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాములు ప్రతి ఏటా ఘనంగా జరుగుతున్నాయని నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.


అన్ని గ్రామాల్లో జాతీయ జెండాలు రెపరెపలాడాలి. చింతం శ్రీనివాస్ హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాం లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ జెండాలు ప్రతి ఇంటిపై ఎగరాలని , ఆ దిశగా పార్టీ శ్రేణులు కృషి చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ పిలుపునిచ్చారు..

ముఖ్యంగా ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్ నిబంధనల వల్ల పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్ అర్హతల నిబంధనలు పేదలు, వృద్ధులు, వితంతు మహిళలు మరియు నిజమైన అర్హుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా 70 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే వృద్ధాప్య పెన్షన్ ఇవ్వడం అత్యంత అన్యాయమైన నిర్ణయం అన్నారు. 57 సంవత్సరాల వయస్సు దాటిన ఎంతో మంది పేద వృద్ధులు పని చేయలేని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారిని పెన్షన్‌కు దూరం చేయడం దారుణమన్నారు. వృద్ధాప్య పెన్షన్ అర్హత వయస్సును 70 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

అలాగే వితంతు మహిళలకు 40సంవత్సరాల వయోపరిమితి విధించడం కూడా పూర్తిగా అన్యాయమని , భర్తను కోల్పోయిన మహిళ ఏ వయస్సులో ఉన్నా ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, వితంతు పెన్షన్‌కు ఎలాంటి వయోపరిమితి లేకుండా అర్హులైన ప్రతి వితంతు మహిళకు పెన్షన్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి కల్యాణ్ చంద్ర , జిల్లా ఈసీ మెంబర్ మావురపు సంపత్ మండల జనరల్ సెక్రెటరీ గొట్టిముక్కల తిరుపతిరెడ్డి , సీనియర్ నాయకులు ,ఎలుక పెల్లి స్వామి, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి**



**అక్షిత బ్యూరో, మంచిర్యాల:** జనగణన--2027 కార్యక్రమంలో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీకి అవసరమైన గ్రామ డైరెక్టరీ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జన గణన సంచాలకులు మాట్లాడుతూ భారత ప్రభుత్వ రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం- న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర జనగణన సంచాలకుల కార్యాలయం మార్గదర్శకాల మేరకు జిల్లాల పరిధిలో అన్ని చార్జ్‌ల పరిధిలో ఫీల్డ్ ఫంక్షనరీలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణల ద్వారా సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ఏకరూపత, ఖచ్చితత్వం, నాణ్యతను నిర్ధారించేందుకు సమగ్ర అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, రవాణా, బ్యాంకింగ్ సేవలు, పోస్టల్ సేవలు, వ్యవసాయం, మార్కెటింగ్ సౌకర్యాలు, సామాజిక, ఆర్థిక మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసే విధానంపై క్షేత్ర సిబ్బందికి తగు శిక్షణ అందించాలని తెలిపారు. చార్జ్ అధికారులు తమ పరిధిలోని ఫీల్డ్ ఫంక్షనరీలకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడంతో పాటు, వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ప్రతి గ్రామం, పట్టణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. నమోదయ్యే ప్రతి సమాచారం సంపూర్ణంగా, ఖచ్చితంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. హ్యాండ్ బుక్ పార్ట్ – ఎ లో గ్రామ, పట్టణ డైరెక్టరీలు, పార్ట్ – బి లో ప్రాథమిక గణన సారాంశం ఉంటాయని తెలిపారు. మొబైల్ యాప్, వెబ్ పోర్టల్, అవసరమైతే భౌతిక షెడ్యూల్ ద్వారా సమాచార సేకరణ జరుగుతుందని తెలిపారు. ఛార్జ్ అధికారుల బాధ్యతలు, ఫీల్డ్ సిబ్బంది నియామకం, యూజర్ ఐడీల సృష్టి, శిక్షణ నిర్వహణ, ఫీల్డ్ వర్క్ పర్యవేక్షణ, డేటా ధృవీకరణ, గౌరవ వేతనాల పంపిణీ, నిర్ణీత గడువులో పనుల పూర్తి వంటి అంశాలు పొందుపరచబడి ఉంటాయని, డేటా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామ/పట్టణ కోడ్లు సక్రమంగా నమోదు చేయాలని, తప్పనిసరి వివరాలన్నీ నమోదు చేయాలని, డూప్లికేట్ సమాచారం లేకుండా సంబంధిత శాఖల రికార్డులతో సరిపోలే విధంగా సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. డేటా భద్రత పరంగా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను గోప్యంగా ఉంచాలని, అధికారిక యాప్, పోర్టల్ మాత్రమే ఉపయోగించాలని, అధికారిక సమాచారాన్ని సోషల్ మీడియా / వ్యక్తిగత మెసేజింగ్ ద్వారా పంచరాదని, పని పూర్తయిన వెంటనే లాగ్ అవుట్ చేయాలని తెలిపారు. అలాగే ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసంహాౌసహాయ వ్యవస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మొహమ్మద్ విలాయత్ అలీ, సంబంధిత అధికారులు హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన హ్యాండ్‌బుక్ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, విధాన నిర్ణయాలు, పరిశోధనలకు ప్రామాణిక సమాచార గ్రంథంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన అన్ని చార్జ్ అధికారులు, ఫీల్డ్ ఫంక్షనరీలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, సమాచార సేకరణ, వెబ్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాకు సంబంధించిన గ్రామీణ, పట్టణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక, మౌలిక వసతులపై సమగ్ర సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, భవిష్యత్ ప్రణాళికాబద్ధ అభివృద్ధికి బలమైన పునాది అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేంద్ర రాథోడ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, ముఖ్య ప్రణాళిక అధికారి, ఉప గణాంక అధికారి రాజేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యమ్మాయ పంటలు వేసుకోవాలి

**ఇరిగేషన్ శాఖ ఎస్ ఈ కేశవరావు**



**గద్వాల అక్షిత న్యూస్:** ఎల్ నీ నో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల వలన రానున్న రోజులలో వర్షాలు తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున వాతా వరణ పరిస్థితులకు అను గుణంగా రైతులు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను వేసుకోవాలని ఇరిగేషన్ శాఖ యస్.ఇ. కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు కు వరద రావడం వలన చెరువులు నింపుకోవడానికి మరియు త్రాగునీటి అవసరాలకు, కాల్వల ద్వారా నీటిని విడుదల చేయడం జరిగినదని, ఈ నీటి విడుదల వరద ప్రవాహము తగ్గిన తర్వాత నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి పరిస్తితులలో వాతావరణ శాఖ అంచనా ప్రకారం వర్షాలు తగ్గి వరద వచ్చే అవకాశం లేదు. కావున రైతులు నీటి విడుదల వ్యవసాయము కొరకు కాదని గుర్తించి కాల్వల ద్వారా పూర్తి పంటకాలానికి నీటి విడుదల ఉంటుందని భావించ వద్దని సూచించారు. కేవలం నీటి విడుదల పరిమిత సమయం మాత్రమేనని, వరద తగ్గిన వెంటనే నీటి విడుదల ఆపివేయబడునని గమనించవాల్సిందిగా అయన రైతులకు తెలిపారు.

# సీపీఐ ప్రచార జాతాను జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలన విధానాలకు నిరసనగా ఈనెల 6 నుండి 14 వరకు నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాతను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి కోరారు. శుక్రవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ..కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పాలనలో నిరుద్యోగం పెరిగిపోయిందని నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి అనేక అంశాలపై మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నిన్న ప్రారంభమైన సీపీఐ ప్రచార జాత ఈ నెల 6 నుండి 14 వరకు కొనసాగుతుందనీ అన్నారు. ఈనెల 9వ తేదీన ఆదివారం ప్రచార జాత చౌటుప్పల్ పట్టణానికి వస్తున్న సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఉడత రామలింగం, బద్దుల సుధాకర్, బోయిన యాదయ్య, టంగుటూరి రాములు, రోషనగారి అంజయ్య, కుంటి పాపయ్య, సింగపంగ బుచ్చయ్య, నీల బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# సమరసత వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

**చేనేత కార్మికులకు సన్మానం**





**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని

మెట్ పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ ఖాదీ కార్యాలయం సిరిసిల్లలో చేనేత కళాకారులను సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది.

చేనేత మన సాంస్కృతిక చారిత్రక స్వాతంత్ర్య వారసత్వమని ,పర్యావరణ హితకరమైన వృత్తి అని వేదిక కరీంనగర్ విభాగ్ సహసంయోజక్ మోర శ్రీనివాస్ తెలిపారు. 1905 ఆగస్టు 7 న భారత స్వాతంత్ర ఉద్యమంలో స్వదేశీ ఉద్యమం ప్రారంభమై స్వదేశీ వస్తువులను వాడాలని విదేశీ వస్తువులను బహిష్కరించాలనే స్ఫూర్తి తోటి ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం స్వదేశీ ఉద్యమాన్ని మరోసారి స్మరించుకోవడం మరియు చేనేత కళాకారుల నైపుణ్యాన్ని ప్రాధాన్యతను గుర్తించడం ఈ రోజు యొక్క ప్రాధాన్యతను తెలుపుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. నేడు కూడా స్వదేశీ వస్తువులను వాడడం భారత ఆర్థిక రంగానికి అత్యంత ఆవశ్యకమని దీనితోటే భారత్ రాబోయే రోజుల్లో ప్రపంచ ఆర్థిక రంగంలో మూడవ స్థానానికి ఎగబాకుతుందని తెలియజేశారు .

ఈ సందర్భంగా సమరసత వేదిక ఆధ్వర్యంలో వేదిక బాధ్యులు ఖాదీ కార్యాలయంలో ఖాదీ కార్యాలయ మేనేజర్ ఆడేపు రమేష్ ,చేనేత కళాకారులు వెంగళ రవీందర్, రిక్కుమల్ల కొమరయ్య మంగళారపు రాజేశం ,కళ్యాడపు దేవదాసు పచ్చునూరి లక్ష్మయ్య ,చాప పద్మ, వెల్ది హరిప్రసాద్ దంపతులను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో వేదిక బాధ్యులు కోడం రవి సుంకోజీ రమేష్ చారి ,మాదాసు శ్రీనివాస్ ,భారతీయ జనతా పార్టీ నాయకులు నాగుల శ్రీనివాస్, ఆడెపు రవీందర్ ,గుడ్ల విష్ణు, గజ్జెల్లి సత్యనారాయణ ,విష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో వెంటనే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి

### ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** భారత విద్యార్థి ఫెడరేషన్ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ, నేటి వరకు ఆ హామీని అమలు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం ప్రకటించినా, ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఒకవైపు విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం కూడా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందన్నారు. వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి, విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు మండల సుర్వి అరవింద్, పోలేపల్లి మల్లేష్, జూనియర్ కళాశాల అధ్యక్షులు సిద్దు, జూనియర్ కళాశాల కార్యదర్శి బడే లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు బిల్లులు ఇవ్వకుండా ఎరువులు విక్రహిస్తే లైసెన్స్ రద్దు

### మండల వ్యవసాయ అధికారి జాస్మిన్



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** రైతులకు బిల్లులు ఇవ్వకుండా ఎరువులు విక్రహిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి జాస్మిన్ హెచ్చరించారు. శుక్రవారం వనపర్తి జిల్లా కొత్తకోటలో వ్యవసాయ శాఖ నిర్వహించిన తనిఖీలలో, శ్రీరామ ట్రేడర్స్, అన్నదాత ఫర్టిలైజర్స్ ఎరువుల డీలర్లు రైతులకు బిల్లులు జారీ చేయకుండా ఎరువులను విక్రయించినట్లు గుర్తించారు. ఇది ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు (ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ – ఎఫ్సిఓ1985 నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో పాటు రైతుల హక్కులకు భంగం కలిగించే విదంగా ఉన్నాయని గుర్తించారు. ఈ ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి, విచారణ అనంతరం సదరు డీలర్‌ల ఫర్టిలైజర్ లైసెన్స్ లను ఒక నెల పాటు సస్పెండ్ చేసినట్లు వ్యవసాయధికారి జాస్మిన్ తెలిపారు. రైతులు ఎవరు సదరు డీలర్ల దగ్గర ఎరువులు కొనుగోలు చేయరాదని తెలిపారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే ప్రతి సందర్భంలో తప్పనిసరిగా బిల్లు లేదా నగదు రసీదు తీసుకోవాలని బిల్లు లేకుండా ఎరువులు విక్రయించడం చట్టవిరుధం , ఇటువంటి ఘటనలు ఎక్కడైనా జరిగినట్లయితే వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఎరువుల విక్రేతలందరూ ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించి, ప్రతి విక్రయానికి బిల్లు జారీ చేయాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

# ఈవీఎం గోదాం తనిఖీ

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ అక్షిత బ్యూరో:** ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ నెలవారి తనిఖీ నిర్వహించారు. శుక్రవారం కలెక్టర్ కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు.

అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిష్టర్ లు సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ హర్ దీప్ సింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మియాపూర్ డివిజన్ పరిధిలో సర్ ఓటర్ల సవరణ ప్రక్రియను పరిశీలన ..

### ముద్దంగుల తిరుపతి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రెటరీ



**మియాపూర్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ఓటరు క్రమబద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి నియోజక వర్గం ఉమ్మడి మియాపూర్ డివిజన్ల పరిధిలోని ప్రశాంత్ నగర్ కమిటీ హాల్, ఎం.ఎ నగర్ కమిటీ హాల్, జనప్రియ వెస్ట్ సిటీ కమిటీ హాల్, బికే ఎంక్లేవ్ కమిటీ హాల్, మయూరి నగర్ వార్డ్ ఆఫీస్, మియాపూర్ న్యూ కాలనీ వినాయక మండపం పలు కాలనీ ప్రాంతాలలో సర్ జరుగుతున్న ఓటరు ఎన్రోల్మెంట్ యొక్క పురోగతిని పరిశీలన చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు డి సి సి.రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ముద్దంగుల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు .ఈ సందర్భంగా ముద్దంగుల తిరుపతి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మంగా చేపడుతున్న సర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు అర్వత కలిగిన ఓటర్లు తప్పనిసరిగా భాగస్వామి కాగలరని కోరారు బి ఎల్ ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో తమ పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి ఓటు హక్కును ఓటు హక్కును పరీక్షించుకోవాలని సూచించారు బూత్ లెవల్ అధికారులు సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు అదేవిధంగా ఒక వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి ఒక ఓటును తొలగించి ఒకటే ఓటు ఉండేటట్టు బి ఎల్ వో లు కృషి చేయాలని నకిలీ ఓట్లను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలపేతం చేయాలంటే ప్రతి అర్వత కలిగిన పౌరులు ఓటర్లుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ స్థానిక నాయకులు కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐ ఎన్ టి యు సి నాయకులు నల్ల సంజీవరెడ్డి,టి పీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు వీరమల్ల వీరేందర్ గౌడ్, ఉయ్యూరు శ్రీదేవి, మాజీ వార్డ్ కమిటీ మెంబర్ వీరమల్ల సంగీత వీరేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి మన్నె నరేందర్ ముదిరాజ్, మియాపూర్ డివిజన్ లేబర్ సెల్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజయ్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కాలనీ వాసులు సామి రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సైని రెడ్డి, మోహన్ రెడ్డి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

### పిఆర్ సి ని ప్రకటించి, పెండింగ్ డిఆర్ మంజూరు చేయాలి

### ఎస్జిపిఏటి నేతలు మేరిఏసుపాదం పరిశపుల్లయ్య




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం వీడి సమస్యలు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్జిపిఏటి) రాష్ట్ర కార్యదర్శి విమేరిఏసుపాదం, పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. పిఆర్సి పెండింగ్ డిఆర్ ఉద్యోగవిరమణ బకాయిలు చెల్లింపు హెల్త్ కార్డులు సత్వరం అందజేసి నగదు రహిత వైద్యం అందించాలని ప్రత్యేకోపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు తో పాటు పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేటు ఏర్పాటు చేయాలని తాము కోరుతున్నామని మేరి ఏసుపాదం పరిశపుల్లయ్య తెలిపారు. హైదరాబాద్ ఇందిరాపార్కులో పెన్షనర్ల సమస్యలతో పాటు పిఆర్సి డిఏ నగదు రహిత వైద్యం కోసం పెన్షనర్ల జేఏసి పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు వేలాది మంది ధర్నా చేసారని ఇప్పటికైనా ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఎస్జిపిఏటి నాయకులు కోరారు. పెన్షనర్లు తమ సమస్యల పరిష్కారానికై ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నారని, పెన్షనర్లు ఉద్యమాలు ఉధృతం కాకముందే సమస్యలు పరిష్కరించాలని ఎస్జిపిఏటి నాయకులు కోరారు. నిన్న హైదరాబాద్ లో జరిగిన పెన్షనర్ల మహాధర్నాలో ఖమ్మం జిల్లా నుండి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారని నాయకులు తెలిపారు.

హైదరాబాద్ లో జరిగిన పెన్షనర్ల మహాధర్నాకు ఖమ్మం జిల్లా నుండి పాల్గొన్న పెన్షనర్లకు ఎస్జిపిఏటి రాష్ట్ర కార్యదర్శి వి. మేరిఏసుపాదం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాయలరవికుమార్ నాయకత్వం వహించారు ధర్నా లో ఎస్జిపిఏటి నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు భాస్కరాచారి కన్నెకంటి కృష్ణ మూర్తి ఊడుగు వెంకటేశ్వర్లు బెల్లం రాధాకృష్ణ మూర్తి మధుకరరెడ్డి ఊడుగుసుధాకర్ యండిహుస్సేన్ ప్రసాదరావు మనోహరరాజు నాగిరెడ్డి వీరభద్రరావు కమల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.